# నగరానికి మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా

## ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం






**హైదరాబాద్, 9, ప్రభాతవార్త**
మిస్ వరల్డ్ పోటీలకు నగరం ముస్తాబైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన అందాల భామలు నగరానికి చేరుకున్నారు. 'మిస్ వరల్డ్-2024' విజేతగా నిలిచిన క్రిస్టినా పిస్కోవా (చెక్ రిపబ్లిక్) శుక్రవారం నగరానికి వచ్చారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రిస్టినాకు అధికారులు ఘనస్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ రీతిలో ఆమెను స్వాగతించారు.



# హైదరాబాద్ వార్త

# నగరం అప్రమత్తం..!

**- 'ఆపరేషన్ సిందూర్'తో మిస్‌వరల్డ్ పోటీల వేదిక..**
**-విమానశ్రయాలు, రైల్వేస్టేషన్లలో భారీ భద్రత**



**హైదరాబాద్, మే9, ప్రభాతవార్తః**
పాక్ ఉద్రిక్తతల నడుమ నగరమంతటా టెన్షన్ వాతవరణం ఏర్పడింది. ఎప్పుడో ఏం జరుగుతుందోనని అణుక్షణం తల్లడిల్లుతున్నారు. ప్రతి నల్గురి కలిసిన చోట యుద్ధాల చర్చలే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మిస్ వరల్డ్ పోటీ వేదిక, విమానశ్రయాలు, రైల్వేస్టేషన్లు, ముఖ్యమైన రెండు బస్‌స్టేషన్లలో కట్టుదిట్టమైన భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అసాంఘీకశక్తులు, ఉగ్రకలాపాల ప్రేరేపిత వ్యక్తులు, ఇతర విపత్తులపైన పోలీసులు దృష్టిసారించారు. హైదరాబాద్, సైబరాబా ద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీసులు మరింత అప్రమత్తమై అణువణువు జల్లెడపడుతున్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులను ఆరా తీస్తూ అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ కలకం రేపింది.

**రోహింగ్యాలు, విదేశీయులపై నిఘా...**
నేటి నుంచి ప్రాపరంభమయ్యే మిస్ వరల్డ్ పోటీలకు గచ్చొబౌలి స్టేడియంలో చుట్టుపరిసరాల్లో వివిధ కంపెనీల బలగాలతో మొహరించనున్నారు. 102 దేశాల అతిధులు హాజరుకానుండడంతో ఎలాంటి భద్రత లోపాలు లేకుండా భారీస్థాయిలో బందోబస్తు కల్పించనున్నారు. స్టేడియంలో గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో పాటు తనీఖీలు, పాస్ ఉన్న వారికి అనుమతులు, వాహనాల తనీఖీలు పెద్ద ఎత్తున పోలీసులతో అడుగడుగునా పహరా కాయనున్నారు. ముఖ్యంగా రోహింగ్యాలు, అక్రమంగా తిష్టవేసిన విదేశీయులను గుర్తించే పనిలో పోలీసులు నిమజ్ఞమయ్యారు. చార్మినార్, యాకుత్‌పుర, బహదూర్‌పుర, సంతోష్‌నగర్, మాదన్నపేట, రాజేంద్రనగర్, గోల్కొండతో పాటు ఆయా సున్నితమైన ప్రాంతాల్లో పరిశీలిస్తున్నారు. అనుమానస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో తనీఖీలు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన సంచారిస్తున్న వారిపై కూడా ఆరా తీస్తున్నారు.

**విమానశ్రయాలు, రైల్వేస్టేషన్లలో భద్రత...**
ఈవెంట్ నేపథ్యంలో అతిథులకు చిన్నపాటి నిర్లక్ష్యాలు లేకుండా వచ్చిపోయే వరకు దగ్గరుండి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. మూడెంచల బందోబస్తును కల్పిస్తూ రక్షణకవచంలా ఉంటున్నారు. అదేవిధంగా రైల్వేస్టేషన్లలో అల్లరిమూకలు అత్యుత్సాహం ప్రదర్శించి అలజడి సృష్టించకుండా ముమ్మర చర్యలు తీసుకుంటున్నారు. అతిపెద్ద బస్‌స్టేషన్‌లు అయిన ఎంజీబీఎస్, జేబీఎస్‌ల్లో కూడా భారీగా పోలీసులు మోహరించి అనుమానస్పద వ్యక్తులు, దేశద్రోహులు, నోటిదూలాలతో వ్యతిరేక కామెంట్లు చేసేవారిపై గమనిస్తున్నారు. బంగ్లాదేశీయులు, ఉగ్రాండ, సౌదీ అరేబీయా, దుబాయ్ దేశస్తులు నగరంలోనే కాకుండా జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమా లను లోతుగా పరిశీలిస్తున్నారు. కామెంట్లతో పాటు వీడియోల టను గమనిస్తూ చర్యలకు ఉపక్రమిస్తున్నారు.


# పండ్ల పాషాణం..!

**-ఫలాలపై రసాయనాల ప్రభావం -కృత్రిమంగా మగ్గబెడుతున్న వ్యాపారులు -మేల్కొనకపోతే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

**హైదరాబాద్, మే 9 ప్రభాతవార్త**
మీరు తింటుంది కమ్మని మామిడి పండ్లు కాదు.. కాలకూట విషం! ఎలా అంటే.. మామిడి మార్కెట్లలో కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్లను కృత్రిమంగా పక్వానికి తీసుకురావడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. హైకోర్టు ఇప్పటికే ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదకరమైన పద్ధతి ఇంకా కొనసాగుతోంది. మీరు తింటుంది కమ్మని మామిడి పండ్లు కాదు.. కాలకూట విషం! ఎలా అంటే..ఉదయం ఆకుపచ్చ రంగులో ఉన్న కాయ.. సాయంత్రానికే పసుపుపచ్చ కలర్ పులుముకుని పండవుతుంది. ఏ మంత్రదండముంటేనో సాధ్యపడే ప్రక్రియే కాదది. జస్ట్ క్యాల్షియం కార్బైడ్ ఉంటే చాలు. చూడ్డానికి రంగు వావ్! అనిపించేలా ఉన్నా.. తింటే మాత్రం రుచిపచీ ఉండదు. పైగా అదో విషతుల్యం. మనల్ని ఊరించే మామిడి పండు కోసం మనమే డబ్బులిచ్చి విషాన్ని కొనుక్కోవడమన్నమాట.

పసుపు పచ్చని మేనితో..చూడగానే చవులూరించే రూపంతో కనిపించే మామిడి పండ్లు కూడా మనల్ని మోసం చేస్తున్నాయి. తక్కువ కాలంలో సొమ్ము చేసుకుందామని కృత్రిమ పద్ధతిలో మామిడి పండ్లను మగ్గపెడుతున్న వ్యాపారుల తీరు వల్ల సహజమైన రుచులను ప్రజలు ఆస్వాధించలేకపోతున్నారు. పైగా రసాయనాలను ఇందుకోసం వాడుతుండటం వల్ల కొనుగోలు చేస్తున్న వారి కారోగ్యాలు కూడా దెబ్బతింటున్నాయి. పండు లోపల గుజ్జు అస్సలు మగ్గనే ఉండదు. అరటి పండ్ల పరిస్థితి అంతే..చూసేందుకు కలర్ ఫుల్‌గా ఉన్నా రుచీ ఉండదు. అవే కాదు..ఆపిల్, బొప్పాయి, సపోటా ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల పండ్ల పరిస్థితీ అంతే. మగ్గకుండానే కాయలు ఎలా రంగు మారుతున్నాయనే అనుమానం అందరికీ వస్తుంది. ఇక్కడే ఉందండీ అసలు కిటుకు. ఇదంతా వ్యాపారుల మాయాజాలం.

కొందరు వ్యాపారులు ధనాశతో వివిధ రకాల పండ్లను కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెడుతూ వాటికి రసాయనాలు జోడిస్తున్నారు. ఆ పండ్లను తిని తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. కరోనా వైరస్‌పై కూడా వీటి ప్రభావం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికారులు కూడా సూచిచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో రసాయన పండ్ల విక్రయాలు నగరంలో, శివారు ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నాయి.



అత్యంత ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌తోపాటు ఇథిలిన్, సల్ఫర్ తదతర రసాయనాలను ఈ పండ్లను మగ్గించేందుకు వినియోగిస్తున్నారు. దీంతో ఆ పండ్లలో ఉన్న పోషకాలు విషపూరితం అవుతున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా అరటి పండ్లను మగ్గించేందుకు ఇథిలిన్ ద్రావణాన్ని నీళ్లలో కలిపి వాటిపై చల్లడం వల్ల అవి రసాయన ప్రక్రియతో కృత్రిమంగా మగ్గుతున్నాయి. అలాగే సపోటాపై కూడా ఈ ఇలాంటి విధానాన్నే అవలంబిస్తున్నాయి. బొప్పాయి మగ్గించేందుకు లిక్విడ్‌తో పాటు గ్యాస్‌ను వినియోగిస్తున్నారని సమాచారం. బత్తాయి పండ్లకు కూడా ఇథిలిన్ రసాయనాన్ని వాడుతున్నారు. ప్రత్యేకించి ఈ వేసవిలో అందుబాటులోకి వచ్చే మామిడి పండ్లలో కాల్షియం కార్బైడ్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఆపిల్‌లో రంగు కోసం రసాయన సూదిమందు ఎక్కించే పరిస్థితి ఉంది. పుచ్చకాయల్లో ఎరుపు రంగు కోసం కూడా ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారని అంటున్నారు. రసాయనాలతో పండించే పండ్ల విధానంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తీవ్రంగా హెచ్చరించింది. ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌ను అనేక దేశాలు, రాష్ట్రాలు నిషేధిస్తే నగరంలో ఇంకా వాటి ద్వారా కాయలను మగ్గబెడుతున్నారని, దీనిపై ఎందుకు దృష్టి పెట్టలేదంటూ నిలదీసింది. ఇలాంటి చర్యలను సహించకూడదని, వెంటనే తీసుకున్న చర్యలేమిటో తమకు తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వైద్యులు కాల్షియం కార్బైడ్ వల్ల క్యాన్సర్ వంటి రోగాలు రావడంతో పాటు.. కిడ్నీలపైనా ఎఫెక్ట్ చూపిస్తుందంటున్నారు. కార్బైడ్ విషంతో మామిడిని మాగబెట్టే ఫల ప్రక్రియపై హైకోర్ట్ 2015లోనే సీరియస్ అయింది. ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని అక్షింతలు వేసింది. అయినా, పరిస్థితులు మారలేదు సరికదా.. ఇప్పుడైతే ఆ ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడ పత్తానే లేకుండా పోయింది.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...**
- -రసాయన పండ్లు తినడం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపులో వికారం ఏర్పడుతుంది.
- -రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలూ తలెత్తుతాయి.
- -కాళ్లలో సూదులు గుచ్చినట్లు, అరచేతి, అరకాళ్లలో చర్మంపై రుగ్మతలు ఏర్పడతాయి.
- -తలనొప్పి, అలసట, నరాల సమస్యలు వస్తాయి.
- -ఊపిరితిత్తులు, మూత్రాశయం వ్యాధులు సంక్రమిస్తాయి.
- -మూత్రపిండాలు దెబ్బతినడమేగాక క్యాన్సర్, వచ్చే అవకాశం ఉంది.
- -మానసిక సమస్యలు కూడా సంక్రమిస్తాయి.
- -కనురెప్పల వాపు తదితర కంటి సమస్యలు తలెత్తుతాయి.

**ఆ జాగ్రత్తలు తప్పదు...**
- -రసాయనాల పండ్లపై అవగాహన పెంచుకోవాలి.
- -పండ్లపై రసాయనాలకు సంబంధించిన మచ్చలు,, పౌడర్ వంటివి ఇంకేమైన ఉన్నాయా అని పరిశీలించాలి.
- -అవగాహన లేకుండా కొనుగోలు చేసిన పండ్లను తినే ముందు వేడినీటిలో కాసేపు ఉంచాలి.
- -ప్రత్యేకించి మైనపు పూత ఆపిల్‌నుతినే ముందు పైతొక్కను పూర్తిగా తొలగించాలి.

# చార్మినార్ వద్ద సింధూర్‌కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బి.సి.కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**చార్మినార్, మే 9 ప్రభాతవార్త :** ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం చారిత్రక చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర సార్మక సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర బి.సి.కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ముఖ్య అతిధిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌ను ఎవరూ ఆపలేరని, భారత దేశ రక్షణ కోసం మనమంతా ఒక్కటేనని తెలిపారు. భారతీయ వీర జవానులకు 140 కోట్ల దేశ ప్రజల మద్దతుందని ఆయన తెలియజేశారు. భారత దేశ వీర జవాన్లకు అండగా నిలబడతామని కాంగ్రెస్ నాయకులు ప్రతిజ్ఞ చేసి వారికి సంఘీభావంగా చార్మినార్ వద్ద జాతీయ జెండాను ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి జి.కన్నయ్య లాల్, సయ్యద్‌షా ముజాహిద్, చార్మినార్, బహదూర్‌పుర, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇంఛార్జీలు ముజీబుల్లా షరీఫ్, పులిపాటి రాజేష్ కుమార్, బోయ నగేష్, కె.రవిరాజ్, కాంగ్రెస్ నాయకులు శ్యాంరావు ముదిరాజ్, ఓం ప్రకాష్ వర్మ, మహ్మద్ ఇక్బాల్, జబ్బార్, వెంకటేష్, చందూ, అలీషాన్, నసీర్, ఫారూఖ్, జ్యోతి పాల్గొన్నారు.

## రష్యా సాధించిన విజయ స్ఫూరితోనే మనకు స్వాతంత్ర్యం




సదస్సులో మాట్లాడుతున్న సయ్యద్ అజీజ్ పాషా

**సైఫాబాద్, మే 9 ప్రభాతవార్త:** ఫ్యాసిజంపై రష్యా సాధించిన విజయ స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య పోరాటం మరింత ముందుకు పోవడంతో స్వాతంత్ర్యం వచ్చిందని ఆ స్ఫూర్తితో అనేక విముక్తి పోరాటాలు విజయవంతం అయినాయని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి, భారత సాంస్కృతిక స్నేహ సంఘం (ఇస్కఫ్) అధ్యక్ష వర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా చెప్పారు. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని అమృత ఏస్టేట్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఫ్యాసిజంపై విజయం సాధించిన 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. రెండోవ ప్రపంచ యుద్ధంలో రష్యా ఫ్యాజిజంపై విజయం సాధించిందని, ఇందుకు 4 కోట్ల మంది సైనికులు ప్రాణత్యాగం చేశారని ఆయన అన్నారు. హిట్లర్ జర్మనిను ఓడించి రష్యా ఓడించి ప్రపంచ విముక్తి పోరాటాలకు బాసటగా నిలిచిందన్నారు. ఇటీవల రష్యాలో జరిగిన 80వ విజయోత్సవానికి తాను హాజరైనానని అజీజ్ పాషా వివరించారు. ఈ సదస్సులో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, సంఘం ఉపాధ్యాక్షుడు కడారి ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.గోపాల్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇస్కఫ్ సభ్యులు భారత సైన్యానికి సంఘీభావంగా హిమాయత్‌నగర్ నుంచి హైదర్‌గూడ వరకు ర్యాలీ నిర్వహించారు.

# సర్వసంస్కృతుల నజరానా సకల కళల ఖజానా తెలంగాణ

**- ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ**

**రవీంద్రభారతి, మే 9 ప్రభాతవార్త :** సంస్కృతి, సౌదర్యం రెండింటి మేళవింపుగా ప్రపంచ సుందరి 2025 ఉత్సవాలు తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవం, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తరుణంలో తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే చక్కని కార్యక్రమాలను ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ రూపొందించి అమలుపరుస్తోందని ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు తెలంగాణకు చెందిన వివిధరకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, చక్కని కళారూపాలను ఈ ఉత్సవాల్లో సమ్మిళతం చేసి ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు హరికృష్ణ వివరించారు. ఈ ఉత్సవాలకు ప్రపంచ దేశాల నుండి నగరానికి విచ్చేసే సుందరీమణుల ఆహ్వానం కోసం రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో ఈ నెల 3నుండి నేటివరకు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్, డప్పులు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో కూడిన బృందాలతో స్వాగతం పలికేలా ఏర్పాటుచేసి 24గంటలూ అందుబాటులో ఉండి ఈ కళాకారులు విమానాశ్రయంలో పోటీలకు విచ్చేస్తున్న సుందరీమణులకు కుంకుమ తిలకం దిద్ది హారతులతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకడం జరిగిందని వివరించారు. నేడు మే 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రపంచ సుందరి ప్రారంభోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతి, కళలు ఉట్టిపడి ఆకట్టుకునేలా రూపొందించామన్నారు. ఉత్సవాలు మొదటగా అందెశ్రీ రచించి ఆస్కార్ పురస్కార గ్రహీత ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూర్చగా ప్రముఖ గాయకుడు కొమాండూరి రామాచారి శిష్యబృందం 50మంది బృందగీతంగా తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపిస్తారని తెలిపారు. అనంతరం 250మంది మహిళా కళాకారిణులు పేరిణిలాస్య సంప్రదాయాన్ని అనుసరించి పేరిణి సందీప్ నృత్యదర్శకత్వంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఫణినారాయణ స్వరాలు సమకూర్చగా కాకతీయుల కాలం నుండి తెలంగాణ శాస్త్రీయ నృత్యరీతిగా ఖ్యాతినొందిన పేరిణి నాట్యప్రదర్శన 10 నిముషాలసేపు ప్రదర్శింపబడుతుందని చెప్పారు. దీనితోపాటు కళాకారులంతా నక్షత్ర ఆకారంలో సీతాకోకచిలుక ఆకారాన్ని, అలాగే మిస్‌వరల్డ్ లోగో ఆకృతిని కూడడా తమ విన్యాసాలలో భాగం ప్రదర్శిస్తారని హరికృష్ణ తెలిపారు. పిదప ప్రపంచదేశాల నుండి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమ ప్రారంభ సూచికగా తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలతో ప్రారంభమౌతాయని వివరించారు. మొత్తంగా సౌందర్య సంస్కృతి కలగలిసిన వేడుకగా ప్రారంభోత్సవ సంబరాలు ప్రత్యేకంగా రూపొందించబడ్డాయని ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ విశదీకరించారు.

# నగరంలో భారీగా కానిస్టేబుళ్ల బదిలీలు

**హైదరాబాద్, మే9, ప్రభాతవార్తః**
నగరంలో ఏళ్లుగా ఆయా స్టేషన్లలో కొనసాగుతున్న సివిల్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల్లో 109 మందిని మార్పులు చేసి విధులను కేటాయిస్తూ నగర సీపీ సీవీ.ఆనంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో ఏకంగా పెద్ద ఎత్తున నలభై మందిని కొత్తవారిని కేటాయించారు.

# పాకిస్థాన్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్ట్

**-విద్యార్థినిపై కేసు నమోదు**

**సైదాబాద్, మే 9 ప్రభాతవార్త:** చంపాపేటలోని వేద కళాశాలలో చదువుతున్న ఒక యువతి పాకిస్థాన్‌కు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిందని, ఆ యువతిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులు ఆ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు పరిశీలించిన కళాశాల యాజమాన్యం ఆ విధ్యార్థినిని కళాశాల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రకటించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# చందానగర్ సెంట్రో షోరూంలో భారీ అగ్ని ప్రమాదం

**-షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు**
**-పక్కనున్న మరో రెండు భవనాలకు అంటుకున్న మంటలు**
**-హాస్పిటల్‌ను ఖాళీ చేయించిన పోలీసులు**
**-కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్**






**సైబరాబాద్ ప్రతినిధి, మే 9 ప్రభాతవార్త :** చందానగర్ సెంట్రో షాపింగ్ మాల్ లో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెంట్రో నేమ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు క్షణాల వ్యవధిలో భవనాన్ని ఆక్రమించాయి. దీంతో అప్రప్తమైన సిబ్బంది అందులో షాపింగ్ చేస్తున్న వారందరినీ బయటకు పంపించి వేశారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఫైరింజన్లు వచ్చేలోపు మంటలు పెద్దవై పక్కన ఆర్కే కలెక్షన్ భవనానికి కూడా వ్యాపించాయి. అనంతరం పక్కనే ఉన్న మరో హాస్పిటల్ భవనానికి మంటలు అంటుకునే ప్రమాదం పొంచి ఉండడంతో అప్రమత్తమైన పోలీసులు ఓ ఫెర్టిలిటీ ఆసుపత్రిని సైతం ఖాళీ చేయించారు. ఈ లోగా ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ ప్రమాదంలో సెంట్రో బిల్డింగ్ తో పాటు ఆర్కే కలెక్షన్ బిల్డింగ్ పూర్తిగా దగ్ధం అవ్వగా ఆసుపత్రి భవనం పాక్షికంగా దెబ్బతిన్నది. మొత్తం 10 ఫైర్ ఇంజన్లను వినియోగించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఆయా భవనాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏవి పనిచేయకపోవడంతో మంటలు పూర్తిగా వ్యాపించాయి. అయితే ప్రస్తుతం మంటలు చెలరేగిన సెంట్రో షాపింగ్ మాల్ భవనం గతంలోనూ అగ్ని ప్రమాదానికి గురైంది. అయినా నిర్వాహకులు సరైన జాగ్రత్త చర్యలు తీసుకోని కారణంగానే తిరిగి అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికి గాయాలు అవ్వలేదని పోలీసులు తెలిపారు. కాగా ముంబై జాతీయ రహదారిపై సాయంత్రం సమయంలో అగ్ని ప్రమాదం సంభవించిన కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.

# డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్, మే9, ప్రభాతవార్తః**
నగరంలో డ్రగ్స్ విక్రయాలు పూర్తిగా నిషేదం కానుట్లుంది. ఎక్కడో ఒక చోట సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై పోలీసుల వివరాలను వెల్లడించారు. నగరంలో యువ వైద్యురాలు గత ఏడాది కాలంగా ముంబాయ్‌కు చెందిన అరవింద్ వాట్సాప్ గ్రూప్‌లో ఆర్డర్ చేసి బాలకృష్ణతో నగరానికి తరలించేవారు. ఈ క్రమంలో రాయదుర్గం చౌరస్తాలో రూ.లక్షల విలువ చేసే 50గ్రాముల కొకైన్‌ను అందజేస్తుండగా విశ్వసనీయ సమాచారంతో తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి వారిద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : బానుక నర్మధ



7వ వార్డు శాస్త్రి నగర్‌లో ఓపెన్ నాలా పనులను ప్రారంభిస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మధ

**కంటోన్మెంట్,మే 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. శు క్రవారం 7వ వార్డులోని లాల్ బజార్ శాస్త్రి నగర్‌లో రూ. 7లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ నాలా పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్ సహాయ సహకారాలతో ఎంపీ,బోర్డు నిధులతో కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పవన్,ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, మనోహర్, మల్లేశ్, తరుణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



2వ వార్డు రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,మే 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 2వ వార్డులోని శ్రీ కాశీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రహారీగోడ, ఆలయ సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణానికి శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులు

### -టియూడబ్ల్యూజే వినతిపై మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి హామీ

**నిజాంపేట్, మే 9, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులను జారీ చేసేందుకు సత్వర చర్యలు చేపడతామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తం కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. దీనస్థితిలో జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టులకు తెల్ల రేషన్ కార్డులను అందించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ శుక్రవారం మంత్రిని కోరారు. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టులకు తెల్ల రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## రైతును మోసం చేసిన వారిపై సిఎం చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ. పక్కనే బాధితుడు డా.బి.కృష్ణ

**సైఫాబాద్, మే 9 ప్రభాతవార్త:** ఒక బాధ్యతాయుతమైన పోలీస్ వృత్తిలో ఉండి అమాయకులను లక్ష్యంగా చేసుకుని వారిని మాయ మాటలతో నమ్మించి మోసం చేసిన చేవెళ్ళ ఎసిపి కిషన్‌పై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ విజ్ఞప్తి చేశావరు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డిజిపి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏరా ్పటు చేసిన విలేకరుల సమావేశంలో బాదితుడు డా.బి.కృష్ణతో కలిసి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా రాచాల పల్లిలో కృష్ణకు వంశపారం పర్యంగా వచ్చిన 7 ఎకరాల 33 గుంటల భూమిని విక్రయించేందుకు కృష్ణ తన సమీప బంధువు ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఎసిపి కిషన్ వద్దకు వెళ్ళి విషయం తెలియజేయడం జరిగిందన్నారు. ఆ భూమని కిషన్ ఇతరులకు 7 కోట్లకు విక్రయించి 3 సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు కృష్ణకు డబ్బులు చెల్లించకుండా వేదింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 22న కొత్తకోటలో బిసి చైతన్య సదస్సు



బీసీ చైతన్య సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సోషల్ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోలా జనార్ధన్ తదితరులు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:**

వెనుకబడిన కులాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో 'బీసీ చైతన్య సదస్సు' నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు చెన్న రాములు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని సోషల్ డెమోక్రటిక్ జేఏసీ కార్యాలయంలో బీసీ చైతన్య సదస్సు పోస్టర్ను కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సోషల్ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోలా జనార్ధన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని స్థాయిలలో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి ఆర్డినెన్స్ ద్వారా చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదిక బడ్జెట్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు న్యాయం చేస్తే ఖసామాజిక న్యాయం ఏర్పడుతుందని, మహిళా బిల్లును సవరించి 33 శాతం నుంచి 50శాతం వరకు పెంచుతూ అన్ని కులాల మహిళలకు జనాభా ప్రకారం ప్రాతినిధ్యం కల్పిస్తేనే సమసమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సోషల్ డెమోక్రటిక్ మహిళా జేఏసీ జాతీయ చైర్‌పర్సన్ స్వరూప, బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు సూర్యనారాయణ, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి..

### -సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్



ధర్నాలో పాల్గొన్న కార్మికులు, సిఐటియు నాయకులు

**నిజాంపేట్, మే 9, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల మార్చి నెల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ఏప్రిల్ మాసంలో 28వ తేదీ పెండింగ్ వేతనాలపై మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ఆ సందర్భంగా కమిషనర్ ప్రమేయంతో మేనేజర్ పవన్ కుమార్ ధర్నాను ఉద్దేశించి పెండింగ్ వేతనాలు మే రెండవ తేదీ మార్చి ఏప్రిల్ 2 మాసాల వేతనాలు చెల్లిస్తామని వాగ్దానం చేశారన్నారు. ధర్నా అనంతరం మేనేజర్‌తో చర్చించినప్పుడు ట్రెజరీకి పంపిన మార్చి నెల చెక్కు ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్నదని ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో అప్రూవల్ అయిన తర్వాతనే వేతనం వస్తుందని చెప్పన్నారన్నారు. ధర్నా రోజు చెక్కు క్యాన్సిల్ చేసి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కనీసం ఏప్రిల్ నెల వేతనం కూడా పూర్తిగా కార్మికులందరికీ అందలేదు. ఈ విషయమై మేనేజర్ స్పందిస్తూ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో మున్సిపల్ నిధులు ఉన్నప్పటికీ బ్యాంకు అధికారులు కార్మికులకు జమ చేయడంలో ఆలస్యం అవుతుందన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వ బ్యాంకుకు నిధులు మళ్లించాలని యూనియన్ కోరడమైనది. ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం మా పరిధిలోలేదని చెప్పారన్నారు. కార్మికుల గ్రూపులకు సంబంధించి అకౌంట్స్‌ను యాక్సిస్ బ్యాంకుకు మార్చి ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మార్చి నెల వేతనం చెల్లింపులు మేము చేయగలిగినది ఏమీ లేదని మేనేజర్ పవన్ కుమార్ వెల్లడించడమైనది. వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు పెండింగ్ వేతనాల విషయమై సమస్యను పరిష్కరించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫైనాన్స్‌లోని ఉన్నతాధికారులు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల చెక్కులను మాత్రమే అప్రూవల్ చేయకుండా వేతనాలు సమయానికి చెల్లించకుండా ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులందరూ ఎక్కువ మంది ఎస్సీ ఎస్టీ సామాజిక తరగతులకు సంబంధించిన వారిని గుర్తు చేశారు. వెంటనే కార్మికుల కడుపుమంట ఆక్రోసాన్ని గుర్తించి ప్రభుత్వమే బాధ్యత వహించి మున్సిపల్ అధికారులు వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పెండింగ్ వేతనాలు విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మికులందరూ ఐక్యమై పోరాడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగశేషు, చిన్న, నరసింహ, మహిపాల్, నాగయ్య, నరసింహ, శీను, అలివేలు, మనీ, లక్ష్మీ, నరసమ్మ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## సమకాలీన పరిస్థితులు-సవాళ్లు అనే అంశంపై సెమినార్

**చిక్కడపల్లి, మే 9 ప్రభాతవార్త:** ఫాసిజం మీద సోవియట్ యూనియన్ సాధించిన విజయం సందర్భంగా సమకాలీన పరిస్థితులు-సవాళ్లు అనే అంశం పైన తేదీ శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎస్. వీరయ్య మాట్లాడుతూ ఫాసిజాన్ని ఓడించడం కోసం నాటి సోవియట్ యూనియన్ అనేక త్యాగాలు చేసి ప్రపంచాన్ని రక్షించిందని, ఫలితంగా 2 కోట్ల మంది ప్రజలు బలిదానం చేశారన్నారు. ఫాసిస్ట్ హిట్లర్ సైన్యం పై ఎర్ర సైన్యం విరోచిత పోరాటం చేసి హిట్లర్ సైన్యాలను జర్మనీ రాజధాని బెర్లిన్ వరకు తరిమి కొట్టారని, బెర్లిన్ పార్లమెంట్ పై ఎర్రజెండా ఎగుర వేశారన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా వచ్చిన మహా ఆర్థిక మాంద్యం పాలక వర్గాలు,పెట్టుబడి దారులు ఇటలీ, జర్మనీలో ఫాసిజాన్ని పెంచి పోషించారని అన్నారు. హిట్లర్ జాతిదురాభి మానాన్ని పెంచి అనేక మందిని చంపి వేయించాడన్నారు. నేడు అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల మీద పెత్తనం చేస్తున్నదని ఇజ్రాయెల్ పాలస్తీనా మీద దాడి చేసి అమాయక ప్రజలను హత్యలు చేస్తున్నారన్నారు.నేడు ఫాసిజం కొత్త పద్ధతులలో ముందుకు వస్తున్నదని అన్నారు. కావున సోవియట్ యూనియన్ ఫాసిజం పై చేసిన పోరాట స్ఫూర్తితో ఎక్కడ ఫాసిస్ట్ లక్షణాలున్నా మనం పోరాటం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సెమినార్ కు సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షత వహించారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు . శ్రీనివాస్లు. శ్రీనివాస్ రావు. దశరథ్. మహేందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాలో జాప్యంపై జలమండలి లైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలి

### - మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ



మణికొండ అల్కాపూర్ రోడ్డు-1 పరిసరాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో నీటి సరఫరాలో జరుగుతున్న జాప్యానికి కారకులైన జలమండలి లైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శుక్రవారం నమస్తే మణికొండలో భాగంగా అల్కాపురి కాలనీ రోడ్డు నెంబర్-1లో బిఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ జల మండలి అధికారుల అజమాయిషి కరువై లైన్‌మెన్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా కొనసాగుతుందని ఆరోపించారు. డబ్బులు దండు కొంటూ ఒక కాలనీలో వరుసగా రెండు గంటల పాటు మంచినీటిని వదులుతున్నారని, డబ్బులు ఇవ్వలేని కాలనీలకు నీటిని వదులడం లేదన్నారు. జల మండలి ఉన్నతాధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించాలని, పాత లైన్‌మెన్లను మరో చోటికి బదిలీ చేసి కొత్త వారికి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ పార్కులో నీటి రిజర్వాయర్‌ను ప్రారంభించి నాలుగు నెలలైనా దాని నుంచి నీటిని సరఫరా చేయడం లేదన్నారు. అలాగే కాలనీలో ఉన్న ఖాళీ ప్లాట్లు, రోడ్లకు ఇరువైపులా చెత్త పేరుకుపోతున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చేస్తున్నారన్నారు. కరెంటు సరఫరా సవ్యంగా లేదని, వీధి దీపాలు వెలుగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైన తెలిపిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు తాము ఫిర్యాదు చేస్తామని, సకాలంలో వాటిని పరష్కరించాలని, లేని ఎడల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సీతారాం ధూళిపాళ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, అందె లక్ష్మణ్‌రావ్, ఏర్పుల శ్రీకాంత్, బొమ్మ పేంద్రనాథ్‌రెడ్డి, ఆరిఫ్ మహ్మద్, రాజేంద్రప్రసాద్, సుమనళిని, శ్రీధర్, కలీల్ తదితరులు పాల్గొన్నారు.

## జవాన్లకు అమ్మ అండగా ఉండాలని దీపాలు వెలిగించిన మహిళలు..



ఆపరేషన్ సింధూర్ లో భారత్ విజయం సాధించాలని కోరుతూ శ్రీభూలక్ష్మీదేవి ఆలయంలో దీపాలు వెలిగించిన మహిళలు.

**బేగంపేట మే 9,ప్రభాతవార్త**

భారత్ పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత సైనికులకు సంపూర్ణ విజయాన్ని అందించాలని,వారికి ధైర్యాన్ని ఇచ్చి అన్ని వేళలా అండగా ఉండాలని,కోరుకుంటూ బేగంపేట ప్రకాశం నగర్‌లోని రామలింగేశ్వరస్వామిదేవస్థానంలోని శ్రీభూలక్ష్మీదేవి ఆలయంలో ఆలయ నిర్మాణ దాత విశాల్‌సుధాం నేతృత్వంలో మహిళలు శుక్రవారం సాయంత్రం అమ్మ వారికి పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో భారతదేశ చిత్ర పటాన్ని చిత్రీకరించి 5సార్లు అయిగిరి నందిని పారాయణం చేసుకుని భారతదేశ చిత్ర పటంపై దీపాలు వెలిగించారు.ఆపరేషన్ సింధూర్‌లో అమ్మ వారు భారత్ సైనికులకు ధైర్యాన్ని నింపాలని వారికి అన్ని సమయాలలో అండగా నిలవాలని వారంతా అమ్మ వారిని కోరుకున్నారు.ఈ సందర్భంగా విశాల్ సుధాం మాట్లాడుతూ అమ్మ వారు భారత్ సైనికులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించేలా శక్తినివ్వాలని,ప్రజలంతా భారత్ జవాన్లకు అండగా నిలవాలని కోరుతున్నానన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, మే 9, ప్రభాతవార్త**

నేడు ఉదయం 9:00 గంటల నుండి 11:00 గంటల వరకు 11కేవీ జీపిఆర్, రిసినియా, ప్రణీత్, వెంకట్ ప్రణీత్, తరుణ్ భస్వానీ, ఎస్ఎల్‌జీ, శ్రీ హోమ్స్, సాయి నగర్ ఫీడర్‌లలోని ఐడిపిఎల్ కాలనీ, జీపిఆర్ లేఅవుట్, బ్లాక్ డైమండ్ కాలనీ, ప్రణీత్ యాంటిల్లా, రిసినియా స్కైయాన్, ఏపిఆర్ ప్రణవ్ యాంటిల్లా రోడ్, ఎస్‌జెబి హిల్స్ రోడ్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా, తరుణ్ భాస్వానీ, శ్రీ హోమ్స్, కెఆర్‌సిఆర్ కాలనీ, సాయి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో కోరారు.

**ప్రశాంతి హిల్స్ సబ్ స్టేషన్‌లో..**

ప్రశాంతి హిల్స్ సబ్ స్టేషన్‌లో నేడు ఉదయం 09:00 నుండి 11:00 గంటల వరకు మైటాస్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ వెంకట్ సాయి ఫీడర్, 11కేవీ పాండురంగ ఫీడర్, 11కేవీ వజ్ర నిర్మాణ్ ఫీడర్‌లలోని వెంకట్ సాయి ఎన్‌క్లేవ్, బాటా షోరూమ్ వెనుక వైపు, వెర్టెక్స్ విల్లాలు, ఆదిత్య సరస్సు, తిరుసంకల్ప్, శ్రీ బాలాజీ, లేక్ రిడ్జ్ అపార్ట్‌మెంట్లు, వజ్ర పుష్పక్ ప్రాంతాలు.. అలాగే ఉదయం 10:00 నుండి 10:30 గంటలు వరకు మయూరి నగర్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ కెటిఆర్ ఫీడర్‌లో కెటిఆర్ కాలనీ, కెఎన్ఆర్ కాలనీ, బాలాజీ హిల్స్, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, వినాయకనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## నేడు కరెంటు సరఫరాలో కోత

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** కొత్త సర్వీసులను రిలీజింగ్ చేస్తుండటం వలన నేడు ఈ క్రింది ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. నార్సింగి -1 సబ్ స్టేషన్ 11.కేవీ శ్రీనగర్ పీడర్ పరిధిలో ఉదయం పది గంటల నుంచి పదిన్నర గంటల వరకు గండిపేట, శ్రీనగర్ కాలనీ, గ్రేహోమ్స్ ప్రాంతాలలో కరెంటు సరఫరా ఉండదు. అలాగే 11.కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరధిలో ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి పది గంటల వరకు బృందావన్ కాలనీ మొత్తం, 11.కేవీ వీరభద్ర ఫీడర్ పరిధిలో ఉదయం పదిన్నర గంటల నుంచి 11.గంటల వరకు వీరభద్ర టెంపుల్, గ్రేహోమ్స్, ఇపిఎల్ ప్రాంతాలలో కరెంటును నిలిపి వేస్తున్నారు. మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ 11.కేవీ సాయిబాబా టెంపుల్ పీడర్ పరిధిలో సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి ఐదు గంటల వరకు గిరిగిరిగడ్డ, నార్సింగి గ్రామం, ముప్పావిల్లాస్, ముప్పా అలేఖ్య ప్రాంతాలలో, 11.కేవీ పిజి కాలేజ్ ఫీడర్ పరిధిలో సాయంత్రం నాలుగు గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు ఫేయిర్ ఫీల్డ్ కాలనీ, ఇవివి కాలనీ, పైనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో కరెంటు సరఫరా ఉండదని తెలిపారు. అలాగే వట్టినాగులపల్లి సబ్ స్టేషన్ ,ఇబ్రహీంభాగ్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంటు సరఫరా ఉండదని ఏఈ మణికంఠ వివరించారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా తమకు సహకరించాలని కోరారు.

## రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి

### -తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



లయన్స్ క్లబ్,సమర్పణ్ ఆధ్వర్యంలో గోశాలలో పశువులకు పశుదాణాను ఆయన పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:**

బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ ఆగర్వాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సమర్పణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మా వైష్ణోవ్ గోశాలలో పశువులకు పశుదాణాను ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను గోవధ నిరసన రోజుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆక్రమంగా తరలిస్తున్న గోసంతతిని చెక్‌పోస్టుల వద్ద నుంచే తిరిగి పంపించి వేయాలని ఆయన కోరారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మండలాల్లో స్పెషల్ టాస్క్ ఫోర్సును మరింత బలోపేతం చేయాలని సూచించారు. గోవదను అరికట్టేందుకు. హైదరాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, మల్కాజిగిరి, రంగారెడ్డి తదితర జిల్లాల్లో గోవధ నిషేధంపై పీస్ కమిటీలతో అధికారులు సమీక్షలు నిర్వహించాలని కోరారు. పశువుల ఆక్రమ రవాణాపై రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒడిస్సా.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్ ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి అక్రమంగా పశువులు నిత్యం వేల సంఖ్యలో నగరానికి వస్తున్నాయన్నారు. పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో కటేశాలకు పశువల తరలింపు పెరిగి పోతుందన్నారు. ఒంటెలు తెలంగాణలోకి తీసుకురావద్దని హైకోర్టు ఆదేశాలున్నా పట్టించుకోకుండా నగరానికి ఒంటెలను తీసుకువచ్చి మాంసం విక్రయిస్తున్నారని. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బక్రీద్ సందర్భంగా పశువుల ఆక్రమ రవాణా మరింత ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున నిఘా కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గో సేవకులు దీపక్ దయాల్ దాదూను ఘనంగా సత్కరించి ఆభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రతినిదులు ప్రేమచంద్ మునోద్, మహేందర్ గుప్తా. శివరాజ్ సుంత్వాల్ మహారాజ్. తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు కేటాయిస్తాం

### -హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రాన్ని అందిస్తున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

**చిక్కడపల్లి, మే 9 ప్రభాతవార్త:**

గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్ బస్తి వాసులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనిరుద్ దురిశెట్టిను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. బస్తి వాసుల ఇళ్లను రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులు కూల్చి ఏడాదిన్నర కావొస్తున్న ఇంత వరకు బాధితులకు ఇళ్లను కేటాయించలేదని, వెంటనే నిరాశ్రయులైన 19 మంది నిరుపేద దళిత కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. ఇళ్ల కేటాయింపు సమస్య పై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర రవాణ, ,బిసి సంక్షేమం, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసామని, మంత్రి నుంచి కలెక్టర్‌కు ఇళ్ల కేటాయింపు కై సూచనలు అందాయని, అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే బస్తి పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచార్చరు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వాసులు ఎంబి.కృష్ణ, జ్ఞానేశ్వర్,ఆనంద్ రావు వున్నారు.


## భక్తిశ్రద్దలతో సత్యనారాయణస్వామి రథోత్సవ ఊరేగింపు



అశోక్‌నగర్ సత్యనారాయణ స్వామి రథోత్సవ ఊరేగింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 9 ప్రభాతవార్త:** భక్తులు తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శుక్రవారం అశోక్‌నగర్ శ్రీ సత్యనారాయణస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్సవ ఊరేగింపు కన్నులపండువగా సాగింది. ఆలయం ఫౌండర్ ట్రస్టీ పల్లెంపాటి వెంకటేశ్వర్లు తనయుడు పల్లెంపాటి వీరయ్య, ఆలయం ధర్మాధికారి నేతృత్వంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జగదునగరు శంకరాచార్య దక్షిణామ్నాయ శారదాపీఠేశ్వర అనంత, భారతీతీర్థమహాస్వామి, విధుశేఖర భారతీతీర్థస్వామి వారి ఆశీర్వ అనుగ్రహంతో జరిగిన ఈ ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. ఆధ్యాత్మిక నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. ఈ కార్యక్రమానికి ముందు సేవాకాలము తిరుప్పావై, హోమాదికాలు, బలిహరణ, గ్రామోత్సవం(ఊరేగింపు), అవబృంధస్నానములు వసంతోత్సవములు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణము, ధ్వజారహణము, ద్వాదశ ప్రదక్షిణలు, చతుర్వేద పారాయణ పండిత సత్కారం, యాజమాన ఆశీర్వచనము, నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ శ్రీపుష్పయాగోత్సవము(పవళింపుసేవ) ఉత్సవాలను నిర్వహించారు.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు



**యూసుఫ్‌గూడ, మే 9, ప్రభాతవార్త :**

బస్తీలలో నివసించే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయటం జరిగిందని నీలిమా ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నీలిమా శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెల 9వ తేదీన నీలిమా 9 పేరుతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు వారికి మందులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పెద్దసంఖ్యలో మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** గుర్తు తెలియని పురుషుడి మృతదేహంను నార్సింగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8.వ,తేదీన ఐదున్నర గంటల ప్రాంతంలో గండిపేట మండలం కోకాపేట్ జెమ్ నక్షత్ర అపార్టుమెంట్ వద్ద గుర్తు తెలియిన పురుషుడు మృతదేహం ఉందని నార్సింగి పెట్రోలింగ్ వాహనానికి సమాచారం అందింది. వెంటనే వాసు, అంజయ్యలు సంఘటనా స్థలానికి వెళ్లి మృతేదహంను పరిశీలించారు. మృతుడు 40.నుంచి 45.ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉంటా డని, మృతదేహంపై నలుపు రంగు చొక్కా, షార్ట్ ఉన్నాయి. మృతదే హంను ఎవరైనా గుర్తు పడుతారా అని స్థానికంగా పోలీసులు ఆరా తీస్తే ఇతడు చెత్త కాగితాలు ఏరుకుంటూ ఉం టాడని, ఆకలి దప్పికలతో మృతి చెంది ఉంటాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి,కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాని పోలీసులు వివరించారు.

## పాతబస్తీ అభివృద్ధి కోసం పాటు పడుతున్న ఎంఐఎం



కార్యక్రమంలో పాల్గొన్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,మీరాలం ఎడిఈ కె.వెంకటేష్ గౌడ్,కార్పొరేటర్లు

**చార్మినార్,మే 9 ప్రభాతవార్త :**

పాతబస్తీ అభివృద్ధి కోసం ఎంఐఎం నిరంతరం కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ అన్నారు.మీరాలం సబ్ డివిజన్ పరిధిలోని చందూలాల్ బారాదరి సెక్షన్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన 160 కె.వి.సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ముబీన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించటానికి పాటు పడుతున్నానని తెలిపారు.మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండ విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలియజేశారు.ప్రజలు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చునని,క్షేత్ర స్థాయిలోనే విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.కాగా బహదూర్‌పురనియోజకవర్గం రంనాస్‌పుర డివిజన్ పరిధిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు,దూద్‌బౌలి డివిజన్ పరిధిలో నాలుగు విద్యుత్ ట్రాన్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు ఖాదర్,సలీం,మీరాలం ఎడిఈ వెంకటేష్‌గౌడ్,ఎంఐఎం నాయకులు,విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని మాజీ డిఎస్పీపై డిసిపి ఫిర్యాదు

**కంటోన్మెంట్, మే 9 ప్రభాతవార్త:** ఆర్టీఐ చట్టాన్ని విశ్రాంత డీఎస్పీ నెల్సన్ దుర్వినియోగం చేయడంతో పాటు పోలీసు అధికారుల విధి నిర్వహణలో ఆటంకాలు కలిగిస్తున్నారని ఉత్తర మండలం డీసీపీ రష్మి పెరుమాళ్ ఈ నెల 7న మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. వెస్ట్ మారేడుపల్లికి చెందిన నెల్సన్ నగర పోలీసు కమిషనర్‌ను కలిసి ఆర్టీఐ చట్టం కింద తన కుమారుడు సచేంద్ర అనురాగ్ ఆయుధం రెన్యువల్ చేయని లైసెన్సు బుక్ ప్రతిని ఇవ్వాలని కోరారు. అనురాగ్ 2016లో ఆయుధ లైసెన్సు రెన్యువల్ కోసం చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలని, గతంలో ఉత్తర మండలం డీసీపీలుగా కొన సాగిన ముగ్గురిపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరినట్లు ఆ ఫిర్యా దులో పేర్కొన్నారు. 2016లో సచేంద్ర తన ఆయుధాన్ని రెన్యువల్ చేయాలని కోరుతూ యూజర్ ఛార్జీల కింద రూ.2 వేలు చెల్లించారు. అతని దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించిన పోలీసులు అనురాగ్తోపాటు నెల్సన్ మరో కుమారుడు సందీప్పై మూడు కేసులు ఉండడం వల్లే ఆయుధాన్ని రెన్యువల్ చేయలేదని తెలియజేశారు.

### ప్రేమ పేరుతో మైనర్ బాలికపై అత్యాచారం ...నిందితుడి రిమాండ్

**కంటోన్మెంట్, మే 9 ప్రభాతవార్త:** ప్రేమ పేరుతో మైనర్ బాలికపైన అత్యాచారం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిన సంఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం .. ఉత్తర్ ప్రదేశ్‌కు రాష్ట్రానికి చెందిన ఓంరాజ్ సైని (20) బతుకుదెరువుకోసం బోయినపల్లికి వచ్చి చిన్న తోకట్ట వద్ద తనస్నేహితులతో కలిసి ఓ రూమ్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమం లో ఇదే ప్రాంతంలో తల్లిదండ్రులతో నివాసం వుంటూ చదువుకుంటున్న పశ్చిమ బెంగాల్‌కు చేందిన ఓ మైనర్ బాలిక (16)తో నిందితుడికి గత సంవత్సరం నవంబర్ నెలలో పరిచయం ఏర్పడింది. తరువాత నిందితుడు బాధితురాలిని ప్రేమిస్తున్నాను అని తెలుపగా ఆమె కూడా అంగీకరించిందని తెలిపారు. దీంతో జనవరి నెలలో స్నేహితులు గది నుండి బయటకు వెళ్ళినప్పుడు నిందితుడు బాధితురాలిని తన గదికి తీసుకెళ్లాడు, అతను ప్రేమ, వివాహం పేరుతో ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకున్నాడని పేర్కొన్నారు. తర్వాత అతను బాధితురాలిని పెళ్లి చేసుకోకుండా తపించుకుని తిరుగుతుండటం ప్రారంభించాడని, బాధితురాలు తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు అంతరం రిమాండుకు తరలించారు

## అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లు అరెస్ట్

**హైదరాబాద్, మే9, ప్రభాతవార్త:** వివిధ రకాలుగా ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయా కేసుల్లో బాధితుల ఖాతాల నుంచి బదిలీ అయిన రూ. కోటిన్నర నగదు ఫ్రీజ్ చేశారు. వాట్సాప్‌లో నకిలీ లింక్ మెస్సేజ్‌లు, స్టాక్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, ఓటీపీ, బ్యాంకులావాదేవీలతో పాటు ఆయా రకాలుగా మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్రంలో 22మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పోలీసులు మరిన్ని వివరాలు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో నకిలీ వెబ్‌సైట్లతో 19 ప్రముఖ కంపెనీల బ్రాండ్లతో స్కిన్, హెయిర్ కేర్ ఉత్పత్తులను ప్రచారం చేస్తూ మోసగించాడు. అదేవిధంగా మరొకరిని ఇన్వెస్ట్‌మెంట్ పేరిట సైబర్ నేరగాడు పలుమార్లు చాటింగ్ చేస్తూ ఎంత ఇన్వెస్ట్ చేస్తే 70శాతం లాభాలుంటాని నమ్మబలికి రూ.17లక్షల 30వేలను సదరు నేరస్తుడు సూచించిన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. తర్వాత పలుమార్లు ఫోన్‌చేసిన స్పందించకపోవడంతో మోసాపోయానని భావించి పోలీసులను ఆశ్రయించాడు. ఇలా రెండు కీలకమైన కేసుల ఆధారంగా టెక్నాలజీ సహయంతో నేరగాళ్లను గుర్తించి ఢిల్లీ, బీహర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల్లోని నేరగాళ్లను అదుపులోకి తీసుకుని నగరానికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వారిపై యాభై కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుల నుంచి 31 మొబైల్‌ఫోన్లు,38 చెక్కులు, 5రబ్బర్ స్టాంప్‌లు,8పాస్‌బుక్స్,రెండు స్కానర్లు ,29డెబిట్‌కార్డు,ఇరవై సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి కన్నీటి వీడ్కోలు


ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు


ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహా తదితరులు


ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, మే 9 ప్రభాతవార్త :** అనారోగ్యంతో మృతి చెందిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహా, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మహముద్ అలీ, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, బిక్షపతియాదవ్, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, రాచకొండ సిపి సుధీర్‌బాబు, మాజీ ఎంపి సర్వే సత్యనారాయణ, బిజెపి సీనియర్ నేత తూళ్ల వీరేందర్‌గౌడ్, బిఆర్ఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, పలువురు పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను వారు కొనియాడారు. పేదల కోసం బండారి రాజిరెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. హబ్సిగూడలోని ఆయన నివాసం నుంచి భారీ ర్యాలీ మధ్య నాచారం, మల్లాపూర్ మీదుగా కుషాయిగూడ నుంచి కీసరలోని వ్యవసాయ క్షేత్రానికి తరలించారు. అక్కడ ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. బండారి రాజిరెడ్డి సోదరుడు ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని పలువురు కలిసి ఓదార్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

### -కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 9 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. శంకేశ్వర్ బజార్‌లో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సంబంధిత సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరింపచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రవణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జేరుసేలం మత్తయ్యకు మాజీ డిప్యూటి సిఎం రాజయ్య పరామర్శ


క్రైస్తవ నాయకుడు జేరుసేలం మత్తయ్యను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య తదితరులు

**ఉప్పల్, మే 9 ప్రభాతవార్త :** ఉప్పల్ టిఎక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రైస్తవ సంఘం నేత జరుసేలం మత్తయ్యను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య పరామర్శించారు. జేరుసేలం మత్తయ్య కాలు నరం శస్త్ర చికిత్స చేయించుకుని ఆసుపత్రిలో గత నాలుగు రోజులుగా వైద్య చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటి సిఎం టి.రాజయ్య ఆసుపత్రికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మత్తయ్య త్వరగా కొలుకుని సమాజ సేవలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ కిషోర్, ఉప్పల్ పాస్టర్ పెలోషిప్ కార్యదర్శి రెవ. అగ్రిపరాజు, చైర్మన్ గోన ఫిలిప్, రెవ తేజమయ, రెవ.ప్రకాష్, బిషప్ భాస్కర్, రెవ.అనిల్, జాబెజ్ కందూరి, సిస్టర్ సోఫియా, బ్రదర్ కోటి, ఆనంద్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత సైనికులకు మనోధైర్యం కలగాలని బిజెపి పూజలు


పూజలు నిర్వహిస్తున్న సామ రంగారెడ్డి, అరుణసురేందర్‌యాదవ్

**ఎల్‌బినగర్, మే 9 ప్రభాతవార్త:** భారత బలగాలకు మనోధైర్యం కలగాలని వేడుకొంటూ బిజెపి నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పహల్గం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చేపట్టిన ఎదురుదాడికి మద్దతు పలుకుతూ పాక్ సరిహద్దుల్లో భారత జవాన్లకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థకాలనీ రామాలయంలో శుక్రవారం బిజెపి నాయకులు పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోనే పాక్ ఉగ్రవాదులకు తగిన రీతిలో బుద్ధి చెప్తున్నాడం పట్ల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**అత్తాపూర్ మే 9,ప్రభాతవార్త :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శనం చేసుకున్నారు. దర్శన అనంతరం ఆలయ పండితులు ఎమ్మెల్యే కి వేద ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాకిస్తాన్ తో పోరాడుతున్న మన దేశ వీర జవాన్లకు మరింత శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పూజలు


పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దంపతులు. చిత్రంలో మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు.

**సైదాబాద్, మే 9 ప్రభాతవార్త:**
చారిత్రక కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయాన్ని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి రేణుక దంపతులు సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు దేవాలయ అర్చకులు, సిబ్బంది, మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డిలు గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు, అర్చకులు గవర్నర్ దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం సాయిరాం నగర్‌లోని దేవాలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి నివాసానికి వచ్చిన గవర్నర్ దంపతులు అక్కడ అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా నల్ల రఘుమారెడ్డి సమిత దంపతులు గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి రేణుక దంపతులకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. సాయిరాంనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు పలువురు గవర్నర్‌ను కలిసారు. ఈ కార్యక్రమంలో సాయిరాంనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కేతిరెడ్డి సురంజన్‌రెడ్డి, అనుముల రవీందర్‌రెడ్డి, సామ రంగారెడ్డి, ముకుంద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జగదీశ్ రెడ్డి, మాజీ ధర్మకర్తలు బీసుకుంట్ల సతీష్ గౌడ్, చీర తిరుమలేష్, కిరణ్ కుమార్, యాదగిరి, డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్‌తో పాటు టింగ్లికార్ రాజేష్, పాశం శ్రీశైలం, శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే విగ్రహం జోలికి వస్తే సహించేది లేదు

### -దళిత, బిసి సంఘాల జెఎసి



**జవహర్ నగర్ మే 9.ప్రభాతవార్త :**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం జోలికి వస్తే సహించేది లేదని దళిత సంఘర్షణ సమితి, బీసీ సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం దళిత సంఘర్షణ సమితి, బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యం లో.. మేడ్చల్ నియోజకవర్గం, జవహర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠపకులు కాయిత రాజు యాదవ్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు రాత్రి ఒంటిగంటకు పోలీస్ బందబస్తుతో జేసీబీ సహాయంతో పూలే విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించారు. పూలే అభిమానులు అడ్డుకొని నిష్క్రమణను నిలిపివేశారు . ఈ సందర్భంగా నల్ల రాధకృష్ణ (డిఎస్ ఎస్ నేషనల్ కోఆర్డినేటర్ ) మాట్లాడుతూ.. జవహర్ నగర్లో ఉన్న అన్ని విగ్రహాలకు లేని పర్మిషన్ నిబంధాలు ఒక్కపూలే విగ్రహానికి ఎందుకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కనుకుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పూలే విగ్రహాన్ని తొలగించాలని చూస్తే బీసీ సంఘాలతో పెద్దఎత్తున రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జవహర్ నగర్ లోని బీసీ, దళిత సంఘాలు పూలే విగ్రహ పరిరక్షణకు పాటుపడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎస్ నాయకులు హెచ్.విష్ణు, పెగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి సంఘీభావంగా విజయోత్సవ సమైక్యత ర్యాలీ



భారత సైన్యానికు మద్దతు గా సంఘీభావ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు.

**వనస్థలిపురం. మే.9.ప్రభాతవార్త**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ చత్రపతి శివాజీ పార్క్ నుంచి ఎస్ కే డి నగర్ చౌరస్తా వరకు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం జగన్మాత సేవలో మొళ్ళూరి నవీన్ శర్మ ,మరియు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి ,ఎల్బీనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సామ రంగారెడ్డి , ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ , డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు హాజరై మాట్లాడుతూ...పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పెహల్గామాలో మన భారత పౌరులపై కాల్పులు జరిపి హత్య చేసిన దుర్ఘటనకు ప్రతీకారంగా మన భారత సైన్యం పాకిస్తాన్ పై జరిపిన మిస్సైల్ దాడి ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు.యుద్ధం వచ్చినా మన సైనికులకు భారత పౌరులుగా మనం భరోసాగా నిలబడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం విజయం సాధించాలని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు


జాతీయ పతాకం చేతబట్టి నినాదాలు చేస్తున్న అర్చకులు, సిబ్బంది

**సైదాబాద్, మే 9 ప్రభాతవార్త:** దేవాదాయ శాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు భారత సైన్యానికి మద్దతుగా వారి క్షేమాన్ని, విజయాన్ని కాంక్షిస్తూ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతీయ పతానికి వందనంనసమర్పిస్తూ జై హింద్..జై శ్రీరాం..జై జవాన్ అంటూ నినాదాలు చేశారు.

### ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో..

ఎల్‌బినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు పందరి డాక్టర్ శివశంకర్ శాస్త్రి, దేవాలయ కార్యనిర్వాహణాధికారి ప్రేమ్ కుమార్ రావు, చైర్మన్ గుంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : గోపినాయక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోపీనాయక్

**ఎల్‌బినగర్, మే 9 ప్రభాతవార్త:**
మే 20 జరిగే దేశవ్యాపితంగా సమ్మెలో హమాలీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలనిసిఐటీయు నాయకులు యం.గోపినాయక్, సిఐటీయు సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్యలు విజ్ఞప్తి చేశారు. ఆర్‌కేపురం డివిజన్ యన్‌టిఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ దగ్గర సిఐటీయు ఆధ్వర్యంలో గోపినాయక్, మల్లెపాక వీరయ్యలు సమ్మె వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గత 11 ఏళ్ళుగా కార్మిక ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని, జాతీయ సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు విక్రయిస్తున్నారని ఆరంభించారు. డిజిల్, ఫిట్రోల్, వంటగ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజలపై పెనుబారం మోపుతున్నారని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు కార్మిక పేదప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు కే.రాములు, యండి.షాలావోదీన్, టి.మల్లేష్, పి.శ్రీను, యన్.రవి, స్వామి, కే.కిరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యా సంస్థలు పేద విద్యార్థుల చదువుకు సాయం చేయాలి : సబితా ఇంద్రారెడ్డి


విద్యా సంస్థలకు శ్రీకారం చుట్టిన మాజీ విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 9 ప్రభాతవార్త:** ప్రైవేటు విద్యా సంస్థలు పూర్తిగా వ్యాపార దృక్పథంతో కాకుండా పేద విద్యార్థుల చదువులకు కూడా సాయం అందించాలని మాజీ విద్యా శాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిందకు వచ్చే గుర్రంగూడ ప్రాంతంలో దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న షణ్ముఖ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యా సంస్థలకు శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఛైర్మన్ రంగమోహన్ చౌదరి, డైరెక్టర్లు డాక్టర్ జ్ఞానదీప్, డాక్టర్ లక్ష్మీ చైతన్య, విజయ్ కృష్ణ, హేమ, తుర్కయాంజాల్ సొసైటీ పిఏసి డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, గుర్రంగూడ నాయకుడు జక్కిడి ముత్యంరెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ ధర్మకర్త మాదరి రమేష్, నాయకులు విజయ్, వీరురెడ్డి, రమణ తదితరులు పాల్గొనా న్నరు.

### నేడు భారత సైనికులకు మద్దతుగా సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ

**సరూర్‌నగర్, మే 9 ప్రభాతవార్త:** పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదుల పీచమణచడానికి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శనివారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి తెలిపారు. దేశం కోసం పోరాడుతున్న త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా రాజకీయాలకు అతీతంగా సబితమ్మ ఈ ప్రతిష్టాత్మక ర్యాలీని జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు బడంగ్‌పేట్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి బాలాపూర్ చౌరస్తా వరకు తలపెట్టిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు, అన్ని పార్టీల వారు హాజరై విజయవంతం చేయాలని రాంరెడ్డి కోరారు.

## టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**అత్తాపూర్ మే 9,ప్రభాతవార్త :**



దేశాన్ని టీబీ (క్షయ ) రహిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆరోగ్య శాఖ మరొక కీలకమైన అడుగు వేసిం ది. శుక్రవారం రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సివై టీబీ పేరుతో ఓ ఆధునిక పరీక్ష విధానాన్ని వైద్య సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ....ఈ పరీక్ష ద్వారా శరీరంలో దాగి ఉన్న టీబీ బాక్టీరియా ఉందో లేదో ముందుగానే గుర్తించడం సాధ్యం అవుతుంది. ముఖ్యంగా టీబీ రోగుల కుటుంబ సభ్యులు, డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు, బీడి, సిగరెట్, మద్యం వాడకులు చేసే వ్యక్తులు కాంటాక్ట్స్‌గా పరిగణించబడి ఈ పరీక్షకు ఎంపికవుతున్నారు. పరీక్ష ఫలితాలు 48 గంటల్లో అందుబాటులోకి వస్తాయి. దాగి ఉన్న టీబీ బాక్టీరియా గుర్తించినట్లయితే, వెంటనే ఐఎన్హెచ్+ ఆర్ ఐహెఫ్ ప్రెవేంటివ్ థెరపీ ద్వారా చికిత్స ప్రారంభించి, టీబీ వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇది పూర్తిగా నివారక చర్యగా పనిచేస్తుందని ఆరోగ్య స్థితిని నిర్ధారించడం ద్వారా సేవల నాణ్యతను పెంపొందించడానికి దోహదపడుతోందన్నారు ఈ కార్యక్రమం ద్వారా టీబీ నిర్ధారణ, నివారణ లో గణనీయమైన పురోగతి సాధించగలమనే ఆశ ఉందని దీని ద్వారా దేశాన్ని టీబీ రహితంగా మార్చే లక్ష్యానికి మరొక మెట్టు చేరుకోగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. హ్యూమరా సుల్తానా, ఎస్.టీ.ఎస్ నరేష్ కుమార్, ఎస్.టీ.ఎల్.ఎస్ రహీం, పబ్లిక్ హెల్త్ మేనేజర్ గౌరీ, ఫార్మసిస్ట్ అనూష, ఎన్.ఎం.లు ప్రేమ, శిల్ప, జ్యోతి, అకౌంటెంట్ సలోమి, ఆశా కార్యకర్తలు చెన్నమ్మ, సరిత, అంబిక తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరణ



**అత్తాపూర్ మే 9,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో శుక్రవారం సరస్వతీ మాత విగ్రహాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ జిఈసిహెచ్ విద్యాసాగర్ ఆవిష్కరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రాచా బత్తుల శ్రీహరిబాబు దంపతుల సహకారంతో నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లోని ప్రధాన ద్వారం ఎదురుగా ఏర్పాటు చేసిన సరస్వతీ మాత విగ్రహం వద్ద శ్రీహరి బాబు దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు సహకరించిన శ్రీహరి బాబు దంపతులను రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ గ్రంథ పాలకుడు డా. వివేక వర్ధన్, సహాయ గ్రంథ పాలకుడు డాక్టర్ ఎన్. పి రవికుమార్ తో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ మేనేజ్మెంట్ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్సీ మీర్జా రియాజ్

**మలక్ పేట ,మే 9, ప్రభాతవార్త:**



ఎమ్మెల్సీ మీర్జా రియాజ్‌ను సన్మానిస్తున్న చౌకి రవికుమార్, మహమ్మద్ గౌస్‌లు

ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన మీర్జా రియాజ్ ను గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, అజంపుర డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చర్యలు తీసుకోవాలి

**మల్కాజిగిరి మే9,ప్రభాతవార్త :**



గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చర్యలు తీసుకోవాలని అలాగే మంచినీరు సరఫరా మెరుగుపరచాలని కోరుతూ ఖైరతాబాద్ లోని వాటర్ వర్క్స్ జిఎం అశోక్ రెడ్డిని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొన్నారు